సాక్షి విశాఖపట్నం

సోమవారం । 18 । మార్చి । 2024

పేదల బతుకుల్లో రాయితీ 'వెలుగులు'

వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో వెలుగులు విరజిమ్మాయి.



8లో



ఈ-వాహనాలకు పన్ను రిలీఫ్!

ఎలక్ట్రిక్ వాహన యజమానులకు శుభవార్త. ఈ-వాహనాల కొనుగోలు చేసే వారికి రోడ్డు ట్యాక్స్ నుంచి మినహాయింపు ఉంటుంది. 8లో

హాయ్.. కియారా

ఆర్.కె. బీచ్‌లో నటి కియారా అద్వానీ ఆదివారం సందడి చేశారు.



8లో

న్యూస్‌రీల్

గ్రూప్-1 ప్రిలిమ్స్‌కు 59 శాతం హాజరు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ అశోక్

విశాఖ విద్య: గ్రూప్ -1 ప్రిలిమ్స్ స్క్రీనింగ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. జిల్లా వ్యాప్తంగా 35 కేంద్రాల్లో పరీక్షలు జరిగింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్స్‌గా జరిగిన పరీక్షకు మొత్తం 19,664 మంది అభ్యర్థులు నమోదు చేసుకోగా 11,679 మంది హాజరయ్యారు. జిల్లాలో 59 శాతం హాజరు నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. 7,985 మంది గైర్హాజరయ్యారు. నగరంలోని ప్రభుత్వ మహిళ కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని జేసీ కె.మయూర్ అశోక్ తనిఖీ చేశారు. కేంద్రాల్లోని గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి ముఖ్య పర్యవేక్షకులకు పలు సూచనలు చేశారు. సీపీ రవిశంకర్ పలు కేంద్రాలను పరిశీలించారు.

స్పందన రద్దు

మహారాణిపేట : సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్టు కలెక్టర్ మల్లికార్జున తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంత వరకు స్పందన కార్యక్రమం ఉండదని పేర్కొన్నారు.

డయల్ యువర్ మేయర్ కూడా..

దాబాగార్డెన్స్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో ప్రతి సోమవారం జీవీఎంసీలో నిర్వహించే డయల్ యువర్ మేయర్, జగనన్నకు చెబుదాం కార్యక్రమాలు రద్దు చేస్తున్నట్లు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున ప్రతి నెలా రెండు, నాలుగు సోమవారాల్లో నిర్వహించే డయల్ యువర్ మేయర్, ప్రతి సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం రద్దు చేసినట్టు పేర్కొన్నారు.

కట్టుదిట్టంగా ఎన్నికల కోడ్ అమలు



పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, జేసీ మయూర్ అశోక్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

మహారాణిపేట: ఉద్యోగులందరూ ఎన్నికల ప్రవర్తన నియమావళిని(ఎంసీసీ) కచ్చితంగా పాటిస్తూ.. నిబంధనలు అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. విజయవాడలోని రాష్ట్ర ఎన్నికల కార్యాలయం నుంచి ఆదివారం ఆయన జిల్లా కలెక్టర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి కలెక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ, జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ , జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, డీఆర్వో కె.మోహన్‌కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం ఆర్వోలు, ఏఈఆర్వోలతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఎన్నికలకు సంబంధించి ప్రతిరోజూ నివేదికను ప్రధాన ఎన్నికల కార్యాలయానికి అందించాలని ఆదేశించారు. జీవీఎంసీ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు ఎంసీసీ కోడ్‌ను కచ్చితంగా అమలు చేయాలన్నారు. సి-విజిల్ యాప్‌లో నమోదైన ఫిర్యాదులకు 100 నిమిషాల్లో సమాధానం ఇవ్వాలన్నారు. రాజకీయ నాయకులు ఓటర్లను ప్రలోభ పెట్టే చర్యలపై వెంటనే విచారణ చేపట్టాలని ఆదేశించారు. జీవీఎంసీ, పోలీసుల సహకారంతో.. సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి వాటిని పరిష్కరించాలన్నారు. ప్రతి ఆర్వో తన పరిధిలో సింగిల్ విండో విధానం అమలు చేస్తూ.. మీడియా సెల్, కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు.

మా దారి మాదే?

- టికెట్ ఆశించి భంగపడ్డ జనసేన నేతల్లో నైరాశ్యం
- స్వతంత్రులుగా పోటీకి దిగాలని కొందరు..
- పార్టీ మారాలని మరికొందరు యత్నం
- చేజారి పోకుండా ఆ పార్టీ అభ్యర్థుల మంతనాలు



సాక్షి, విశాఖపట్నం : జనసేనపై ఎన్నో ఆశలు పెట్టుకున్న ఆ పార్టీ నేతలు దిక్కులు చూస్తున్నారు. ఒకపక్క టికెట్లు దక్కకపోవడం, మరోపక్క టీడీపీతో పొత్తులో అరకొర సీట్లకే అధ్యక్షుడు అంగీకరించడంపై వీరు ఇప్పటికే తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పార్టీ పుట్టుక నుంచి కష్టపడి పనిచేస్తున్న వారిని పక్కనబెట్టేసి నిన్నగాక మొన్న వైఎస్సార్ సీపీ నుంచి జంప్ చేసి వచ్చిన వారికి సీట్లు కేటాయించడం వీరికి అస్సలు మింగుడు పడడం లేదు. పెందుర్తి సీటు పంచకర్ల రమేష్‌బాబుకు, విశాఖ దక్షిణ సీటు వంశీకృష్ణ శ్రీనివాస్‌కు ఖరారు చేయడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఇన్నాళ్లూ అంతా మీరే.. భవిష్యత్తు మీదే.. అంటూ పార్టీ కోసం అన్ని పనులూ చేయించుకుని ఇప్పుడు కరివేపాకుల్లా తీసి పారేశారని సీనియర్లు రగిలిపోతున్నారు. టీడీపీతో పొత్తు ఖరారై, సీట్ల ప్రకటన జరిగాక తమను అస్సలు పట్టించుకోవడమే లేదని వీరు ఆవేదన చెందుతున్నారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శులకే చుక్కెదురు!

విశాఖ జిల్లాకు చెందిన ఇద్దరు నాయకులు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా ఉన్నారు. వీరిలో ఒకరు టి.శివశంకర్ కాగా మరొకరు బొలిశెట్టి సత్యనారాయణ. శివశంకర్ పెందుర్తి సీటును, బొలిశెట్టి అనకాపల్లి ఎంపీ స్థానాన్ని ఎప్పట్నుంచో ఆశిస్తున్నారు. ఇప్పుడు వారిద్దరికీ సీట్లు దక్కలేదు. కొన్నాళ్ల క్రితం వరకు 'పెందుర్తి సీటుపై ముందుగా మీతో సంప్రదించాకే నిర్ణయం తీసుకుంటారు' అంటూ జనసేన ముఖ్య నాయకులు శివశంకర్‌కు చెబుతూ వచ్చారు. తీరా ఆ సీటును వైఎస్సార్ సీపీ నుంచి పార్టీ ఫిరాయించిన పంచకర్ల రమేష్‌బాబుకు కేటాయించారు. అనంతరం ఆ పార్టీ మీడియా వ్యవహారాలు చూసే వ్యక్తితో శివశంకర్‌కు ఫోన్ చేయించి సారీ చెప్పించారు. తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన పార్టీకో నమస్కారం పెట్టేసి తిరిగి లాయర్‌గా ప్రాక్టీసు చేసుకుంటానని అనుచరుల వద్ద వాపోయినట్టు తెలిసింది. మరో ప్రధాన కార్యదర్శి బొలిశెట్టిదీ అదే పరిస్థితి. ఇటీవల జరిగిన జనసేన ఆవిర్భావ దినోత్సవం నాడు విజయవాడలో అధినేత పవన్‌ను కలవడానికి వెళ్లిన ఆయనకు చుక్కెదురైంది. తాను ప్రధాన కార్యదర్శినని చెప్పినా 'సో వాట్' అంటూ గెంటేసినంత పనిచేశారని, దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురయ్యారని చెబుతున్నారు.

వారందరికి మొండిచెయ్యి!

విశాఖ దక్షిణ సీటుపై జనసేనలో నలుగురైదుగురు ఆశలు పెట్టుకున్నారు. ఇన్నాళ్లూ వీరు చేతి చమురును భారీగానే వదిలించుకున్నారు. ఇప్పుడు వారిని కాదని వంశీకృష్ణకు కేటాయించారు. ఇక భీమిలి టికెట్టు తనకే ఖాయమైందని సంబరాలు చేసుకున్న పంచకర్ల సందీప్‌ను కూడా 'త్యాగరాజు' జాబితాలో చేర్చేశారు. మరోవైపు విశాఖ ఉత్తర సీటు కోసం ఎదురు చూస్తున్న పసుపులేటి ఉషాకిరణ్‌కూ మొండిచెయ్యే చూపారు. కొన్నేళ్లుగా గాజువాక టికెట్టును ఆశిస్తున్న జనసేన పీఏసీ సభ్యుడు కోన తాతారావుకూ ఝలక్ ఇచ్చారు. అంతేకాదు.. చోడవరం సీటుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రాజుకూ ఆశాభంగమే ఎదురైంది. ఈయన టీడీపీ అభ్యర్థి ఓటమే లక్ష్యంగా స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగాలని యోచిస్తున్నట్టు సమాచారం. అలాగే ఇప్పటికే అనకాపల్లి సీటునాశించి భంగపడ్డ పరుచూరి భాస్కరరావు జనసేనకు గుడ్‌బై చెప్పేశారు. ఇప్పుడు అక్కడ జనసేన అభ్యర్థిని ఓడించే పనిలో ఉన్నారని ఆయన అనుచరులు చెబుతున్నారు.

ఎవరి దారి వారు చూసుకోవాలని..

తాజా పరిస్థితులతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన శ్రేణులు తీవ్ర నిరుత్సాహంగా ఉన్నారు. జనసేన టికెట్లు ఆశించి భంగపడిన వారు ఆ పార్టీలో ఇంకా కొనసాగేకంటే ఎవరి దారు వారు చూసుకోవాలని యోచిస్తున్నారు. వారిలో కొందరు స్వతంత్రులుగా పోటీ చేసి తమ సత్తా చాటుకోవాలని, మరి కొందరు మళ్లీ అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో వైఎస్సార్ సీపీలోకి చేరాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి వారిని జనసేన జిల్లా, నగర అధ్యక్షులు పంచకర్ల, వంశీకృష్ణలు పార్టీని వీడి వెళ్లవద్దని బతిమలాడుతున్నారు. వారిని చేజారిపోకుండా తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.

విజయోస్తు..

- నేటి నుంచి 10వ తరగతి పరీక్షలు
- సర్వం సిద్ధం చేసిన అధికారులు

పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు	31,379
పరీక్ష కేంద్రాలు	138

కంట్రోల్ రూమ్ నంబర్లు
92488 18959
77804 53490



రవీంద్ర భారతి స్కూల్‌లో ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: జిల్లాలో సోమవారం నుంచి 10వ తరగతి పరీక్షలు ప్రారంభమవుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరగనుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం పక్కా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 28,367 మంది రెగ్యులర్, 3,012 మంది ప్రైవేట్(వన్స్ ఫెయిల్డ్) విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. పరీక్షల నిర్వహణకు 138 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతీ కేంద్రంలో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు కేటాయించి, అక్కడ వసతి, ఫర్నిచర్ సౌకర్యం కల్పించారు. ఎండల తీవ్రత దృష్ట్యా తాగునీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. డీఈవో ఎల్.చంద్రకళ ఆదివారం స్క్వాడ్ అధికారులతో కలసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు పరిశీలించారు.

పరీక్షలపై ప్రత్యేక నిఘా

గత అనుభవాల నేపథ్యంలో పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా ప్రత్యేక తనిఖీ బృందాలను నియమించారు. జిల్లాలో 138 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ఏ కేటగిరీ కింద 48, బీ కేటగిరీ కింద 81, సీ కేటగిరీ కింద 9 కేంద్రాలు ఉన్నాయి. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక ఫోకస్ పెట్టారు. 138 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 138 డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 14 రూట్ ఆఫీసర్లు, 14 మంది అసిస్టెంట్ రూట్ ఆఫీసర్లు, 1,258 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. సీ-కేటగిరీ కింద గుర్తించిన కేంద్రాల్లో పరిశీలన కోసం అదనంగా ఐదుగురు అసిస్టెంట్ డిపార్ట్‌మెంట్ అధికారులను సిద్ధం చేశారు.

కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు : పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది. కేంద్రాలకు వంద మీటర్ల వరకు 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతిస్తారు. పరీక్ష విధులకు నియమితులైన ఉపాధ్యాయులు కూడా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు తీసుకురాకూడదు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటలకు కేంద్రంలో రిపోర్ట్ చేయాలి. ప్రశ్నాపత్రాలపై ప్రత్యేక గుర్తింపు నంబర్(క్యూఆర్ కోడ్)ను ముద్రించారు. ప్రశ్నాపత్రం బయటకు వస్తే, అది ఎక్కడ నుంచి వచ్చిందనేది సులువుగా గుర్తించే అవకాశం ఉంది. ఇందుకు బాధ్యులైన ఉపాధ్యాయులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్యాశాఖాధికారులు హెచ్చరించారు.

11 కేంద్రాల్లో ఓపెన్ పరీక్షలు

సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలు కూడా సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. ప్రతి రోజూ మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. పదో పరీక్షలకు 986 మంది హాజరవుతుండగా, వీరి కోసం ఐదు కేంద్రాలు.. ఇంటర్మీడియట్‌కు 1,215 మంది హాజరవుతుండగా, వీరి కోసం ఆరు కేంద్రాలను సిద్ధం చేశారు.

విద్యార్థులకు ఆల్ ద బెస్ట్



పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. కేంద్రాల్లో ఇన్విజిలేషన్ సిబ్బంది అప్రమత్తతో ఉండాలి. స్క్వాడ్ సిబ్బంది తరచూ కేంద్రాలను తనిఖీ చేయాలి. ఎటువంటి అవాంతరాలు ఎదురైనా సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలి. అధికారులు, సిబ్బంది అంతా సమన్వయంతో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పూర్తయ్యేందుకు కృషి చేయాలి.

– బి.విజయ భాస్కర్, ఆర్జేడీ

ప్రతిపక్షాల దుష్ప్రచారాలను తిప్పికొట్టండి

- న్యాయవాదుల పాత్ర ఎంతో కీలకం
- విశాఖకు పరిపాలన రాజధాని రాకుండా టీడీపీ అడ్డుకుంది
- రాష్ట్ర భవిష్యత్ కోసం మళ్లీ వైఎస్సార్ సీపీ గెలవాలి
- రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స
- హాజరైన పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ ప్రెసిడెంట్ మనోహర్‌రెడ్డి



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎంపీ ఎంవీవీ, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, చిత్రంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, వైఎస్సార్ సీపీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ ఉత్తర అసెంబ్లీ అభ్యర్థి కె.కె రాజు, లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాళిదాసు రెడ్డి

సాక్షి, విశాఖపట్నం: భారత్ లాంటి ప్రజాస్వామ్యదేశంలో న్యాయాన్ని నలుదిక్కులా నడిపించాల్సింది న్యాయవాదులేనని వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కో-ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. వీఎంఆర్డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఉత్తరాంధ్ర న్యాయవాదుల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల ప్రభుత్వ పాలనపై ప్రతిపక్షాలు, వాటి అనుకూల మీడియా చానళ్లు, పత్రికలు చేస్తున్న దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని, ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని న్యాయవాదులకు పిలుపునిచ్చారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒకటీ నెరవేర్చలేదని, ఇప్పుడు మళ్లీ పొత్తులతో గుంపులుగా దొంగ హామీలతో వస్తున్నాడని ఎద్దేవా చేశారు. ఈ విషయంలో వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత న్యాయవాదులపై ఉందన్నారు. సీఎం జగన్ అధికారంలోకి వచ్చిన వెంటనే 'వైఎస్సార్ లా నేస్తం' పేరిట యువ న్యాయవాదులకు ఆర్థికభృతి అందించారన్నారు. ఐదేళ్ల పాలనలో 99 శాతం హామీలను అమలు చేయడమే కాకుండా విద్య, వైద్యం, వ్యవసాయం రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం జగన్ కట్టుబడి ఉన్నారని, శ్రీకాకుళం జిల్లాలోని ఉద్దాన ప్రాంతంలో కిడ్నీ వ్యాధి రూపుమాపడానికి రూ.750 కోట్లతో మంచి నీటి సౌకర్యం కల్పించారని, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మించారని గుర్తు చేశారు. ఉత్తరాంధ్రలోని అన్ని స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకునేలా సమష్టిగా పనిచేద్దామన్నారు.

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ ఐదేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజల జీవన ప్రమాణాలు పెరిగాయన్నారు. ఈ విషయాన్ని నీతి ఆయోగ్ ప్రకటించిందని గుర్తు చేశారు. మన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడాలనే ముందుచూపుతో విద్యలో అనేక సంస్కరణలు తీసుకొచ్చామన్నారు. విశాఖ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోందని, విశాఖలో అయితే తక్కువ ఖర్చుతో రాజధాని నిర్మాణం పూర్తవుతుందన్నారు. తద్వారా చెన్నై, ముంబయి నగరాలకు దీటుగా మరింత అభివృద్ధి చెందుతుందన్నారు.

వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మాట్లాడుతూ ఫోర్త్ ఎస్టేట్‌లో న్యాయ విభాగం ముఖ్య భూమిక పోషిస్తుందన్నారు. అలాంటి న్యాయవ్యవస్థలో తాను కూడా భాగం కావడం సంతోషంగా ఉందన్నారు. ప్రాంతీయ అసమానతల కారణంగా మద్రాస్, హైదరాబాద్‌లను వదులుకుని రావాల్సి వచ్చిందని.. మళ్లీ అలాంటి పరిస్థితులు రాకూడదనే పరిపాలన వికేంద్రీకరణను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొస్తే.. కొన్ని దుష్టశక్తులు న్యాయపరమైన చిక్కులు సృష్టించాయన్నారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర ప్రాంతంలో విశాఖ పరిపాలన రాజధాని అయితేనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. అందుకే ఉత్తరాంధ్రలోని అన్ని ఎంపీ, ఎమ్మెల్యే సీట్లు గెలిపించుకుని.. మన విశాఖను పరిపాలన రాజధానిగా చేసుకుందామన్నారు.

విశాఖ ఎంపీ, వైఎస్సార్ సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఐదేళ్లలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలల ఆధునికీకరణ, ఆంగ్ల మాధ్యమం, రెండు భాషల్లో పాఠ్య పుస్తకాలు, జగనన్న విద్యా కానుక, అమ్మ ఒడి, పౌష్టికాహారం ఇలా ఎన్నో పథకాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి నూతన ఒరవడి సృష్టించారన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే 11 జిల్లాల్లో సమావేశాలు ఏర్పాటు చేసి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో న్యాయవాదులకు జరిగిన సంక్షేమం, మేలు గురించి వివరించినట్లు చెప్పారు. ఐదేళ్ల కాలంలో న్యాయస్థానాల ద్వారా చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకున్నారని ఆరోపించారు. విశాఖకు పరిపాలన రాజధాని, కర్నూల్‌కు హైకోర్టు రాకుండా చిక్కులు సృష్టించారని.. ప్రస్తుతం ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉందన్నారు. గతంలో తెలుగుదేశం న్యాయవాదులకు 20కిపైగా హామీలు ఇచ్చిందని, అందులో ఒక్కటి కూడా అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైందని, కౌంటింగ్ వరకు పార్టీకి, పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలకు లీగల్ సెల్ అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు చాలా కీలకమని, ప్రతిపక్షాల కుతంత్రాలను తిప్పికొట్టాలన్నారు.

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళిదాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన హామీలంటినీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. గతం కంటే మిన్నగా.. ఈ ఎన్నికల్లో న్యాయవాదులు, వారి కుటుంబాల ఓట్లు వైఎస్సార్ సీపీకి వేసి మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. న్యాయవాదులకు నామినేటెడ్ పోస్టుల్లో అవకాశం కల్పించాలని కోరారు.

ఈ సందర్భంగా న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడు ఆధ్వర్యంలో న్యాయవాదులు వై.వి.సుబ్బారెడ్డిని కోరారు. ఈ విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ విశాఖ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె రాజు, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, లీగల్ సెల్ విశాఖ జోనల్ అధ్యక్షుడు జీఎం రెడ్డి, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అధ్యక్షులు బాజీనాయుడు, ఆడారి వీర వెంకట సత్యనారాయణ, మురళీమోహన్, గణేష్, వాసుదేవరావు, పాకా సత్యనారాయణ, కె.శ్రీనువాసులరెడ్డి, విశాఖ, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారీగా ఈ-సిగరెట్లు పట్టివేత

- రెండు షాపులపై టాస్క్‌ఫోర్స్ దాడులు
- 743 విదేశీ ఈ-సిగరెట్ బాక్సుల లభ్యం
- ముంబై నుంచి విశాఖకు తీసుకువచ్చినట్టు సమాచారం
- మూడో పట్టణ పోలీసులకు అప్పగింత
- ఇద్దరు నిర్వాహకుల అరెస్ట్?

విశాఖ సిటీ: నగరంలో విదేశీ ఈ-సిగరెట్ల అక్రమ వ్యాపార ముఠాకు టాస్క్ ఫోర్స్ పోలీసులు చెక్ పెట్టారు. ఆదివారం ఒక టాయ్స్ షోరూంతో పాటు మరో షాపుపై చేసిన దాడుల్లో భారీగా అనధికార ఈ-సిగరెట్లు గుర్తించారు. ఈ వ్యవహారంపై పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడుతుండడంతో వివరాలను గోప్యంగా ఉంచుతున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. నగరంలో రెండు షాపుల్లో ఈ-సిగరెట్ల వ్యవహారంపై టాస్క్ ఫోర్స్ పోలీసులకు సమాచారం తెలిసింది. దీనిపై ఆదివారం సాయంత్రం కేర్ ఆస్పత్రి ప్రాంతంలో ఉన్న ఒక టాయ్స్, గిఫ్ట్ షోరూంతో పాటు దసపల్లా హిల్స్ ప్రాంతంలో ఉన్న మరో షాపుపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఇందులో కేర్ ఆస్పత్రి సమీపంలో ఉన్న షాపులో 656, దసపల్లా హిల్స్ ప్రాంతంలో ఉన్న షాపులో 87 ఈ-సిగరెట్ బాక్సులు లభ్యమైనట్లు తెలిసింది. చిన్న పిల్లల ఆట వస్తువులు, గిఫ్ట్ బాక్స్‌లతో పాటు అక్రమంగా ఈ-సిగరెట్లను విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. విదేశాల నుంచి ముంబై మీదుగా విశాఖకు తీసుకువచ్చినట్లు సమాచారం. దీంతో అవి ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? ఎవరు సరఫరా చేశారు? ఎక్కడెక్కడ విక్రయాలు జరుపుతున్నారన్న విషయాలపై పోలీసులు విచారణ చేపడుతున్నారు. సిగరెట్లను మూడో పట్టణ పోలీసులకు అప్పగించారు. షాపు నిర్వాహకులు ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వాటి విలువ, ఇతర వివరాలను సోమవారం వెల్లడించే అవకాశాలు ఉన్నాయి.

వైఎస్సార్ సీపీ సమరోత్సాహం

- ఉరిమే ఉత్సాహంతో కదన రంగంలోకి..
- కూటమి మాయమాటల వలలో పడబోమంటున్న ప్రజానీకం
- సంక్షేమం, అభివృద్ధికే మా ఓటు అంటున్న విశాఖ వాసులు



సాక్షి, విశాఖపట్నం: బడుగు వర్గాలకు భరోసానిస్తూ.. ఉరిమే ఉత్సాహంతో వైఎస్సార్ సీపీ సార్వత్రిక రణ క్షేత్రంలో దూకుడు పెంచింది. గుంపులుగా వస్తూ.. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన కూటమి.. పడుతూ లేస్తూ పరుగులు తీస్తోంది. నోటిఫికేషన్ వెలువడక ముందే.. అన్ని స్థానాలను ప్రకటించిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. అన్ని వర్గాలకూ సమ ప్రాధాన్యమిస్తూ.. అందరి అభిమానాన్ని చూరగొన్నారు. మే 13న పోలింగ్ స్టేషన్లలో ప్రత్యర్థుల్ని 'గిరా గిరా' తిప్పేద్దామంటూ పార్టీ శ్రేణులు సిద్ధమవుతుంటే.. ఇంకా తమ నియోజకవర్గ అభ్యర్థి ఎవరు వస్తారా అని కూటమి వర్గాలు బేలగా ఎదురు చూస్తున్నాయి. కూటమి మాయమాటల వలలో పడి మరోసారి మోసపోకుండా.. విశాఖ ప్రజలు 'స్పష్టమైన' తీర్పు నిచ్చేందుకు ఎదురు చూస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికే ఓటువేసి మరోసారి వైఎస్సార్ సీపీని అందలం ఎక్కించేందుకు సన్నద్ధమవుతున్నారు.

బలంగా వీస్తోన్న పంకా 'గాలి'

ఉమ్మడి విశాఖ జిల్లాలో మూడు పార్లమెంట్, 16 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. 2019 ఎన్నికల్లో మూడు పార్లమెంట్ స్థానాలను వైఎస్సార్ సీపీ క్లీన్ స్వీప్ చేసింది. అదే విధంగా 16 అసెంబ్లీ స్థానాలకు 12 చోట్ల వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయదుందుభి మోగించారు. గత ఎన్నికల్లో మహా నగరం ప్రజలు టిడ్కో ఇళ్ల మాయమాటలతో టీడీపీ నేతల వలలో పడిపోయారు. కానీ ఈ సారి నగరంలో పరిస్థితులు వేరుగా ఉన్నాయి. గడిచిన ఐదేళ్లలో కులం, మతం, ప్రాంతం, రాజకీయం.. ఏమీ చూడకుండా అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రజలు ఫిదా అయ్యారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సాగించిన అద్భుత పాలనని, టీడీపీ హయాంలో సాగించిన అరాచక పాలన, భూకబ్జాలు, అవినీతి, అక్రమాల్ని బేరీజు వేసుకుంటున్నారు. మళ్లీ 2019కి ముందు రోజులు రాకూడదంటే.. సంక్షేమం, అభివృద్ధికే పట్టం కట్టాలని భావిస్తున్నారు. విలువలతో కూడిన రాజకీయం, పాలనే కొలమానంగా వైఎస్సార్ సీపీ ఎన్నికలకు వెళ్తుంటే... అరాచక శక్తులన్నీ ఒక్కటై.. మాయమాటలతో ముందుకు వస్తున్నాయి.





ఈ-వాహనాలకు పన్ను రిలీఫ్!

- గతేడాది జూన్ నుంచి రోడ్డు ట్యాక్స్ వసూలు
- గత నెల నుంచి మినహాయింపునిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- 12-18 శాతం సొమ్ము వాహనదారునికి ప్రయోజనం



సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ (ఎలక్ట్రిక్) వాహన యజమానులకు శుభవార్త! ఈ-వాహనాల కొనుగోలు చేసే వారికి రోడ్డు ట్యాక్స్ (పన్ను) నుంచి మళ్లీ మినహాయింపు లభించింది. అన్ని రకాల ఎలక్ట్రిక్ (బ్యాటరీ) వాహనాల కొనుగోలును ప్రోత్సహిస్తూ వాటి వినియోగాన్ని పెంచాలన్న లక్ష్యంతో గతంలో ప్రభుత్వం రోడ్డు ట్యాక్స్‌తో పాటు రిజిస్ట్రేషన్ ఫీజును కూడా రద్దు చేసింది. అయితే గత ఏడాది జూన్ ఏడో తేదీ నుంచి వీటిలో రోడ్డు ట్యాక్స్‌కు ఇస్తున్న మినహాయింపును రద్దు చేసింది. అప్పట్నుంచి ఈ విద్యుత్ వాహనాలకు రోడ్డు పన్నును వసూలు చేస్తోంది. అలా ఈ ఏడాది జనవరి ఆఖరు వరకు ఈ పన్ను వసూలు కొనసాగింది. తాజాగా ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఈ-వాహనాలకు రోడ్డు పన్ను నుంచి మినహాయింపునిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రవాణా శాఖ అధికారులు గత ఎనిమిది నెలలుగా వసూలు చేస్తున్న రోడ్డు ట్యాక్స్ (మోటార్ వెహికల్ ట్యాక్స్)ను నిలిపివేశారు. ఫిబ్రవరి ఒకటి నుంచి జులై ఏడో తేదీ వరకు కొనుగోలు చేసే ఈ-వాహనాలకు రోడ్డు పన్ను చెల్లింపు నుంచి మినహాయింపు లభించంది. ఎలక్ట్రిక్ వాహనాల్లో టూ వీలర్లు, ప్రయాణికుల/లగేజి ఆటోలు, కార్లు, బ్యాటరీ ఎలక్ట్రిక్ వాహనాలు, బస్సులు ఉన్నాయి. విశాఖపట్నం జిల్లాలో 4,592 ఎలక్ట్రిక్ వాహనాలున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన తాజా వెసులుబాటుతో ఈ-వాహనాలు కొనుగోలు చేసే వారు రోడ్డు పన్నును చెల్లించే పనిలేదన్న మాట! ప్రస్తుతం రూ.5 లక్షల వరకు విలువ చేసే ఎలక్ట్రిక్ వెహికల్‌కు 12 శాతం, రూ.5-10 లక్షల వాహనానికి 14 శాతం, రూ.10-20 లక్షల విలువైన వెహికల్‌కు 17 శాతం, రూ.20 లక్షలకు పైబడిన వాహనానికి 18 శాతం చొప్పున రోడ్డు పన్ను వసూలు చేస్తున్నారు. ఇకపై ఈ-వాహనాలకు రోడ్డు ట్యాక్స్ చెల్లించాల్సిన అవసరం లేదని రవాణా శాఖ అధికారులు చెబుతున్నారు. దీనివల్ల విద్యుత్ వాహనం కొనుగోలుదారునికి కనిష్టంగా రూ.10 వేల నుంచి గరిష్టంగా రూ.4 లక్షల వరకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కల్పించిన రోడ్డు ట్యాక్స్ మినహాయింపు అవకాశాన్ని వినియోగదార్లు సద్వినియోగం చేసుకుని విశాఖ నగరంలో కాలుష్య తీవ్రతను తగ్గించడానికి దోహదపడాలని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సి.రాజారత్నం కోరారు.

అమ్మ ప్రేమ అమేయం..



కుమార్తెకు భోజనం తినిపిస్తున్న తల్లి

విశాఖ విద్య: బిడ్డ బాగు కోసం పరితపించేది అమ్మ. కంటిపాపలా రక్షణగా నిలవడమే కాదు... కన్నబిడ్డలు ఉన్నత స్థితికి చేరి, పదిమందిలో గుర్తింపు పొందేలా వెన్నంటి ఉండి నడిపించేదే మాతృప్రేమ. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీ వద్ద ఆదివారం అలాంటి దృశ్యమే కనిపించింది. అనకాపల్లి జిల్లా మామిడిపాలేనికి చెందిన వై.లక్ష్మీదేవి దివ్యాంగురాలు. గ్రూపు-1 పరీక్ష రాసేందుకు తల్లిని వెంటబెట్టుకుని వచ్చింది. ఉదయం పరీక్ష రాసి, తిరిగి మధ్యాహ్నం సెషన్‌లో మరో పరీక్షకు హాజరయ్యే తరుణంలో లక్ష్మీదేవి తల్లి వెంట తీసుకొచ్చిన భోజనాన్ని బిడ్డకు తనే స్వయంగా తినిపించింది. ఇది చూసిన వారంతా అమ్మ ప్రేమ అంటే ఇదే కదా... అనుకున్నారు.



హాయ్.. కియారా

కొమ్మాది: ఆర్.కె. బీచ్‌లో నటి కియారా అద్వానీ ఆదివారం సందడి చేశారు. ఇక్కడ పరిసర ప్రాంతాల్లో ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో గేమ్ ఛేంజర్ సినిమాకు సంబంధించిన పలు సన్నివేశాలను చిత్రీకరించారు. తోటి నటీనటులతో ఆమె షూటింగ్‌లో పాల్గొన్నారు. పొలిటికల్, యాక్షన్, థ్రిల్లర్ కథాంశాలతో తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రామ్‌చరణ్ హీరోగా, కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్నారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై నిర్మిస్తున్న ఈ సినిమాను దిల్‌రాజు నిర్మిస్తున్నారు. సంగీతం ఎస్.ఎస్ థమన్ అందిస్తున్నారు.

గీత దాటితే వేటే..

- ఎన్నికల షెడ్యూల్ విడుదలతో అమల్లోకి ఎన్నికల కోడ్
- సామాన్యుల నుంచి ప్రజాప్రతినిధుల వరకూ కోడ్ పాటించాల్సిందే..
- రూ.50 వేలకు మించి నగదు ఉంటే ఆధారాలు చూపించాల్సిందే..



సాక్షి, విశాఖపట్నం : సార్వత్రిక సమర సంరంభం మొదలైంది. ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చేసింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్) ఉల్లంఘనలకు పాల్పడితే చర్యలు కఠినంగా ఉంటాయని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ప్రకారం ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు రాజకీయ పార్టీలు, వారి అభ్యర్థులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జరిగే పనులను పర్యవేక్షించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంటుంది. కోడ్ అమలులో ఉన్నప్పుడు రాజకీయ పార్టీలు అనుసరించాల్సిన నియమాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున వెల్లడించారు.

సాధారణ ప్రవర్తనా నియమావళి

- విభేదాలు, వైషమ్యాలు, పరస్పర ద్వేషాలు, కులాలు, మతాలు, జాతుల మధ్య రగిల్చే కార్యక్రమాల్ని అభ్యర్థులు నిర్వహించకూడదు.
- ఉదయం 10 నుంచి సాయంత్రం 6 వరకే అభ్యర్థులు ప్రచారం చేయాల్సి ఉంటుంది.
- రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు ప్రచార కార్యక్రమాలపై నిషేధం అమలులో ఉంటుంది.
- రాజకీయ పార్టీలకు చెందిన అభ్యర్థులు, నాయకులు మసీదు, చర్చి, ఆలయాల వంటి మతపరమైన ప్రదేశాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించకూడదు.
- అభ్యర్థులు తమ ప్రత్యర్థుల వ్యక్తిగత జీవితంపైన, కుటుంబంపైన ఎలాంటి విమర్శలు, ఆరోపణలు చేయకూడదు.
- ఓటర్లను బెదిరించడం, ప్రలోభాలకు గురిచేయడం వంటివి చేయకూడదు.
- ఓటరు కాని వారు ఓటు వేసేందుకు యత్నిస్తే నేరం. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ప్రచారం చేయడం, ఎన్నికల సమయానికి 48 గంటల ముందు బహిరంగ సభలు ఏర్పాటు చేయకూడదు.
- పోలింగ్ కేంద్రాల వద్ద పార్టీల ప్రతినిధులు ఓటర్లను తరలించకూడదు.
- ఇళ్లు, స్థలాల యజమాని అనుమతి లేకుండా పార్టీకి చెందిన బ్యానర్లు, జెండాలు, ఫెక్సీలు, హోర్డింగులు పెట్టడానికి వీల్లేదు.

శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉండవిక

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయడానికి వీల్లేదు.
- ప్రభుత్వం ఎలాంటి కొత్త పథకాలను కూడా ప్రకటించడానికి వీల్లేదు. సర్కారు తరపున ఏ పని చేయాలన్నా ఎన్నికల కోడ్ రూల్స్‌కు లోబడే చేయాల్సి ఉంటుంది.
- ప్రభుత్వ పథకాలకు సంబంధించి ఇప్పటికే బస్టాండ్లు, రైల్వేస్టేషన్లతో పాటు ఎయిర్ పోర్టుల్లో ఏర్పాటు చేసిన ప్రకటనలను తొలగించాల్సిందే.
- ప్రభుత్వ డబ్బులతో టీవీలు, పేపర్లలో కూడా ఎలాంటి ప్రకటనలు ఇవ్వటానికి వీల్లేదు.
- ఉద్యోగాలు ఇవ్వటం, ఉన్న ఉద్యోగులకు ప్రమోషన్లు ఇవ్వటం లాంటివి కూడా చేయకూడదు.
- మంత్రులు కూడా తమ అధికారిక హోదాల్లో పర్యటనలు చేయటానికి వీల్లేదు. అంటే.. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా వారికి ప్రభుత్వం తరపున కేటాయించిన వాహనాలు, భవనాలు ఉపయోగించకూడదన్న మాట.

ముందస్తు అనుమతి తప్పనిసరి

- ఎన్నికల ప్రచారంలో పెద్ద పెద్ద లౌడ్ స్పీకర్లు ఉపయోగించాలనుకుంటే.. ముందుగానే స్థానిక అధికారుల అనుమతి తీసుకోవాలి.
- ఎన్నికల ర్యాలీలకు ముందు ఆయా పార్టీల నేతలు స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలి.
- ర్యాలీలు, సభలు, సమావేశాల వల్ల ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలి, అందుకు అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలి.
- ఇతర పార్టీల నాయకులు, అభ్యర్థులను పోలిన దిష్టిబొమ్మలను తీసుకెళ్లడం, అలాంటివి తగలబెట్టడం నిషేధం.

రూ.50 వేలు మించకూడదు..

- పోటీలో ఉండే అభ్యర్థులు, వారి ఏజెంట్లు, రాజకీయ పార్టీల కార్యకర్తలు రూ.50 వేలకు మించి డబ్బులు, రూ.10 వేల కంటే ఎక్కువ విలువైన వస్తువులను రవాణా చేయటం నిషేధం.
- రూ.50 వేలకు మించి తీసుకు వెళ్లాల్సి వస్తే.. కచ్చితంగా ఆ నగదుకు సంబంధించిన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది.
- పార్టీల స్టార్ క్యాంపెయినర్లు రూ.లక్షకు మించి నగదు కలిగి ఉండకూడదు.
- పరిమితికి మించి డబ్బులు రవాణా చేస్తున్న వాహనాలను కూడా ఆ డబ్బులతో పాటుగా సీజ్ చేస్తారు.
- ఇక మద్యం కూడా ఎక్కువగా తీసుకెళ్లడానికి వీల్లేదు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

ఫిర్యాదుల స్వీకరణకు కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు చేయనున్నారు. 1950 కాల్ సెంటర్‌తో పాటు వెబ్‌సైట్ ఆధారంగా ఫిర్యాదులను స్వీకరించనున్నారు. ఫిర్యాదులపై ప్రతిరోజు సాయంత్రం 5 గంటల లోగా జిల్లా ఎన్నికల అధికారి రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక సమర్పించాల్సి ఉంటుంది. ఫిర్యాదులన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి పంపుతారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయంతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై నిఘా కోసం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, వీడియో బృందాలు, మొబైల్ బృందాలను ఏర్పాటు చేస్తారు. డబ్బు, మద్యం పంపిణీ జరగకుండా విస్తృత స్థాయిలో తనిఖీలను ప్రారంభిస్తారు. ఎన్నికల్లో సామాజిక మాధ్యమాల దుర్వినియోగంపై ఫిర్యాదులొస్తేనే చర్యలు తీసుకుంటారు. అవసరమైతే ఫిర్యాదులపై సైబర్ పోలీసులు చర్యలు తీసుకోనున్నారు. ఫేస్‌బుక్, వాట్సప్ సంస్థలలో రాజకీయ పరమైన పోస్టింగ్‌లపై కూడా నిఘా ఉంటుంది.

పేదల బతుకుల్లో రాయితీ 'వెలుగులు'

- ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు విద్యుత్ రాయితీ
- గత ప్రభుత్వం కంటే వైఎస్సార్ సీపీ హయాంలోనే లబ్ధి

సాక్షి, విశాఖపట్నం: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల ఇళ్లల్లో వెలుగులు విరజిమ్మాయి. ప్రజా సంక్షేమాన్ని కాంక్షించే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తామని ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీని నెరవేర్చారు. దాదాపు ఐదేళ్ల కాలంలో టీడీపీ హయాంలో ఇవ్వలేనంతగా రాయితీతో కూడిన విద్యుత్‌ను అందించారు. 2014-19 మధ్య కాలంలో ఇచ్చిన రాయితీ విద్యుత్ కంటే 2019-24లో ఇచ్చిన విద్యుత్ ఆరురెట్లు ఎక్కువగా ఉందంటే.. ఎస్సీ, ఎస్టీలంటే ఈ ప్రభుత్వానికి ఎనలేని ప్రేమ ఉందని అర్థమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్లు మాత్రమే విద్యుత్‌ను ఉచితంగా అందజేసేది. అది కూడా అరకొర సరఫరాయే. దీనికంటే డబ్బులు కట్టుకుని విద్యుత్‌ను వాడుకుంటే మంచిదనే అసహనం లబ్ధిదారుల్లో కనిపించేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సీ కాలనీల్లో, ఎస్టీ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులైన వారందరికీ ఉచిత విద్యుత్ పరిమితిని 100 యూనిట్ల నుంచి 200 యూనిట్లకు పెంచింది. గత ప్రభుత్వం ఇచ్చిన ఉచిత విద్యుత్ కంటే రెట్టింపు యూనిట్లు అధికంగా అందిస్తోంది. అర్హత కలిగిన వినియోగదారులందరికీ ఈ పథకాన్ని వర్తింపజేసింది. విద్యుత్ పంపిణీ సంస్థల(డిస్కమ్‌లు) క్షేత్రస్థాయి సిబ్బంది.. అర్హత కలిగిన వినియోగదారుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసి.. ఈ ప్రయోజనం అందజేశారు.

ఆరు రెట్లు పెరిగిన రాయితీ

గత ప్రభుత్వంతో పోలిస్తే.. ఎస్సీ, ఎస్టీలకు ఇస్తున్న విద్యుత్ సబ్సిడీ దాదాపు ఆరు రెట్లు పెరిగింది. అర్హులైన ఏ ఒక్కరికీ ఈ ప్రభుత్వం విద్యుత్ రాయితీని ఎత్తేయలేదు. సాంకేతిక తప్పిదాలు, క్షేత్రస్థాయి వాస్తవాల్లో తేడాలు ఏమున్నా ఏపీఈపీడీసీఎల్ స్థానిక అధికారులు వెంటనే సరిదిద్దుతున్నారు. గతంలో ఏ చిన్న సమస్య వచ్చినా..రాయితీ అందకపోయినా పట్టించుకునేవారు కాదు. కానీ ఈ ప్రభుత్వ హయాంలో గ్రామ, వార్డు సచివాలయాలను సంప్రదిస్తే.. సిబ్బంది లబ్ధిదారుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. టీడీపీ హయాంలో 7.9 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులు విద్యుత్ రాయితీ పొందగా.. ప్రస్తుతం 8.90 లక్షల మంది రాయితీ అవకాశాన్ని పొందుతున్నారు.

ఈపీడీసీఎల్ పరిధిలో రాయితీ వివరాలివీ...

ఎస్సీ లబ్ధిదారులకు...

2014-19 మధ్య కాలంలో రాయితీ విలువ	రూ.96.40 కోట్లు
2019-24 మధ్య కాలంలో రాయితీ విలువ	రూ.630.35 కోట్లు

ఎస్టీ లబ్ధిదారులకు...

2014-19 మధ్య కాలంలో రాయితీ విలువ	రూ.77.96 కోట్లు
2019-24 మధ్య కాలంలో రాయితీ విలువ	రూ.200.52 కోట్లు



జనసైనికుల అరాచకం

- ఆ పార్టీ కార్యకర్తపై ఇనుపరాడ్డుతో దాడి
- వంశీకృష్ణ బ్రోద్భలంతోననే బాధితుడి ఆవేదన
- వారి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు

జగదాంబ: జనసైనికుడిపై ఆ పార్టీ నేతలు హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన ఆదివారం రాత్రి రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుడు లుక్స్ గణేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గీత్ సంగీత్ థియేటర్ సమీపంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఆదివారం ఉదయం జనసేన నాయకుడు వంశీకృష్ణ శ్రీనివాస్ అనుచరులతో వచ్చారు. ఈ కార్యక్రమానికి వార్డు నాయకుడు నీలం అచ్చిరాజుతో కలిసి జనసైనికుడు లుక్స్ గణేష్ హాజరయ్యాడు. అదే సమయంలో వంశీకృష్ణ అనుచరులు వాసుపల్లి నరేష్, నవీన్ అతడితో గొడవ పడ్డారు. వాసుపల్లి నరేష్ రాత్రి 10 గంటలు దాటిన తరువాత అర్జెంటుగా కలవాలని తనకు ఫోన్ చేశాడని, అక్కడకు వెళ్లగానే రాడ్డుతో దాడికి పాల్పడ్డారని గణేష్ తెలిపాడు. వారి నుంచి తప్పించుకొని కేజీహెచ్‌కు వెళ్లి చికిత్స చేయించుకున్నానని, అనంతరం రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసినట్టు వెల్లడించాడు. వంశీకృష్ణ అనుచరుల నుంచి తనకు ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిపాడు. పదేళ్లుగా జనసేన పార్టీలో ఉంటూ సేవలందిస్తున్నానని అటువంటి తనపై వంశీకృష్ణ శ్రీనివాస్ అనుచరులు దాడికి పాల్పడడం ఆవేదనకు గురి చేసిందన్నారు.

రాష్ట్రానికి బీజేపీ చేసింది శూన్యమే..

డాబాగార్డెన్స్ : రాష్ట్రానికి కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం చేసింది శూన్యమేనని ఏపీ కాంగ్రెస్ కమిటీ మీడియా చైర్మన్ ఎం.తులసీరెడ్డి ఆరోపించారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ పదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రానికి చేసింది శూన్యమన్నారు. విశాఖపట్నంలో రైల్వేజోన్, కాకినాడలో పెట్రోలియం కారిడార్, పోలవరంతో పాటు పలు ప్రాజెక్టులను కేంద్రం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రత్యేక హోదాను అయితే గాలికొదిలేసిందని మండిపడ్డారు. రాష్ట్రంలోని మూడు పార్టీలు రాష్ట్ర ప్రయోజనాలు పక్కన పెట్టి మోదీ కీర్తనతో కాలక్షేపం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపేందుకు కనీస ప్రయత్నాలు చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర, రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పుడే ప్రజలు సుఖంగా ఉంటారన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, అధికార ప్రతినిధి జి.వెంకట్రావు, ఏపీఎస్ వర్మ పాల్గొన్నారు.

బీజేపీతో భవిష్యత్తు అంధకారమే

- ఆ పార్టీ మాయ నుంచి బయటకు రండి
- రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ పిలుపు



మాట్లాడుతున్న రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్

సీతంపేట: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిజస్వరూపాన్ని గ్రహించి మేల్కొనకపోతే భవిష్యత్ అంధకారమేనని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. ప్రజలు బీజేపీ మాయలోంచి బయటకొచ్చి దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్ బచావో ఆధ్వర్యంలో ఆదివారం రామాటాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో 'బీజేపీ వాగ్దానాలు-వైఫల్యాలు' అనే అంశంపై నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. దేశంలో గత నలభై ఏళ్లలో లేనంతగా నిరుద్యోగ సమస్య తీవ్ర రూపంలో తాండవిస్తోందన్నారు. 2022 జనవరిలో 35 వేల నాన్ టెక్నికల్(క్లాస్ 4) పోస్టుల భర్తీకి రైల్వే చేపట్టిన రిక్రూట్‌మెంట్‌లో కోటి 25 లక్షల మంది దరఖాస్తు చేశారని, దానిని బట్టి దేశంలో నిరుద్యోగం ఏ స్థాయిలో ఉందో తెలుస్తుందన్నారు. గాజాలో యుద్ధం జరుగుతుంటే ఇజ్రాయిల్‌లో ఉద్యోగాలు చేయడానికి భారతీయ యువత దరఖాస్తు చేస్తుందంటే.. ప్రాణాల కంటే ఉద్యోగ అవసరమే ఎక్కువగా ఉందని స్పష్టమవుతోందని చెప్పారు. రష్యా తరపున యుద్ధం చేయడానికి కూడా యువత సిద్ధపడ్డారని, ఈక్రమంలో హైదరాబాద్ కుర్రాడు అక్కడ చనిపోయిన విషయాన్ని గుర్తు చేశారు.

దేశంలో 24 శాతం నిరుద్యోగం

దేశంలో 24 శాతం, 20 నుంచి 23 ఏళ్ల మధ్య 42 శాతం నిరుద్యోగం ఉందని, ఈ విషయంలో ఇరాన్, ఒమన్, లెబనాన్ దేశాల సరసన భారత్ చేరిందని ప్రభాకర్ తెలిపారు. పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో 12 శాతం నిరుద్యోగం ఉంటే భారత్‌లో 24 శాతం ఉందన్నారు. ఉద్యోగానికి అవసరమైన శిక్షణ, అర్హత లేని యువత దేశంలో పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగానికి అవసరమైన నైపుణ్యాలు ఉన్న యువత 5 శాతం ఉండగా, సౌత్ ఆఫ్రికాలో 85 శాతంగా ఉందని చెప్పారు. స్కిల్ ఇండియా, మేకిన్ ఇండియా, స్టార్టప్ ఇండియా అనే నినాదాలు తప్ప.. ఉద్యోగాల కల్పనకు శిక్షణ లేదన్నారు. దేశంలోకి విదేశీ పెట్టుబడులు రావడం లేదని, ఉన్న పెట్టుబడులు ఉపసంహరణ జరుగుతున్నాయన్నారు. దేశ పౌరసత్వాన్ని విడిచి వెళ్లిపోతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోందని, దేశంలో ఇంధన, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్రాలకు, కేంద్రానికి మధ్య సహకార సంబంధాలు లేవని, బీజేపీ పాలిత రాష్ట్రాలతో పోల్చితే మిగతా రాష్ట్రాలకు నిధులు చాలా తక్కువ ఇస్తున్నారని దుయ్యబట్టారు. సుదీర్ఘ స్వాతంత్య్ర పోరాటంలో ఇసుమంతైన పాత్ర లేని సంస్థలు దేశభక్తులుగా చలామణి అవుతున్నాయని ఎద్దేవా చేశారు. వి.వి.లక్ష్మీనారాయణ, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, పొన్నాడ శ్రీనివాస్, ఎస్సార్ వేమన పాల్గొన్నారు.

'టెన్'షన్ వద్దు

- మానసిక ఒత్తిడి జయిస్తే విజయం మీదే
- సమయపాలన పాటిస్తే మంచి మార్కులు
- పరీక్షల వేళ ఆరోగ్యం జాగ్రత్త



కేడీపీఎం స్కూల్‌లో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులను సిద్ధం చేస్తున్న ఉపాధ్యాయురాలు(ఫైల్)

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమవుతున్నాయి. తొలిసారిగా పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనేసరికి.. విద్యార్థుల్లో ఎక్కడా లేని ఆందోళన కనిపిస్తుంది. ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలనే పోటీతత్వంతో తీవ్రమైన ఒత్తిడికి గురవుతారు. 10వ తరగతి పరీక్షలు కీలకం కావడంతో తల్లిదండ్రుల్లోనూ ఇదే ధోరణి ఉంది. పరీక్షల వేళ ఇది ఎంతమాత్రం మంచిది కాదని విద్యావేత్తలు, మానసిక వైద్యనిపుణులు చెబుతున్నారు. ముందస్తు ప్రణాళిక అమలు చేసినందున.. విద్యార్థులు భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని ఉపాధ్యాయులు భరోసా కల్పిస్తున్నారు.

ఒత్తిడి జయిస్తేనే విజయం

- ఏడాదంతా చదివిన సబ్జెక్టులే అయినందున, ఒత్తిడి జయించి సమయస్ఫూర్తితో పరీక్షలు రాస్తే.. విజయం విద్యార్థుల ముంగిటే ఉంటుందని ఉపాధ్యాయులు అంటున్నారు.
- ప్రశ్నాపత్రం ఇచ్చిన తర్వాత ఏమాత్రం టెన్షన్ పడకూడదు. కొద్దిసేపు ప్రశాంతంగా దానిని చదివి, బాగా వచ్చిన వాటినే ముందుగా రాయడం ప్రారంభించాలి.
- పరీక్ష రోజుల్లో టీవీ, సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటేనే మంచిది. తల్లిదండ్రులు ఈ విషయంలో బాధ్యత తీసుకోవాలి. ఇంటి వద్ద మంచి వాతావరణం కల్పించేలా చూడాలి.

సమయ పాలన కీలకం

- ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష ప్రారంభ సమయానికి ఒక గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలి.
- ప్రతీ సబ్జెక్టులో వంద మార్కులకు జవాబులు రాయాల్సి ఉన్నందున.. ఏ ప్రశ్నకు ఎంత సమయం కేటాయించాలని ముందుగానే గుర్తుంచుకోవాలి. అన్ని ప్రశ్నలకు తప్పనిసరిగా జవాబులు రాసేందుకు ప్రయత్నించాలి.
- గణితం నాకు రాదనే ధోరణి వీడాలి. చిన్నపాటి సూత్రాలను జ్ఞాపకం తెచ్చుకుంటే.. ఈజీగానే జవాబులు రాయవచ్చు. ఫిజిక్స్, బయాలజీలకు వేర్వేరుగా పరీక్ష నిర్వహిస్తున్నందున వీటిని సునాయసంగానే ఎదుర్కొవచ్చు.

నమ్మకంతో పరీక్షలు రాయాలి



పరీక్షలను ఎదుర్కొనేందుకు విద్యార్థులు సానుకూలతతో ఆలోచన చేయాలి. నేను కచ్చితంగా పాసవుతాననే నమ్మకంతో ఉండాలి. పాఠ్యపుస్తకాల్లోంచే ప్రశ్నలు వస్తాయి కాబట్టి.. ఒకటికి రెండు సార్లు ఆలోచించి, గుర్తుకు తెచ్చుకునేందుకు ప్రయత్నించాలి.

– ఎస్.సుమతీ బాయి, హెచ్ఎం, కేడీపీఎం హైస్కూల్

ఆందోళన వద్దు



తొలిసారి పబ్లిక్ పరీక్షలు రాస్తున్నామనే ఆందోళన ఏమాత్రం వద్దు. టెన్షన్ పడితే చదివిందే అయినా, మరిచిపోతాం. ఏడాదంతా స్కూల్లో పరీక్షలు రాసిన విధంగానే ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి. పరీక్షల రోజుల్లో ఆరోగ్యం బాగా చూసుకోవాలి. నిర్ణీత సమయం నిద్రపోవాలి.

– డాక్టర్ రాజేశ్వరరావు, మానసిక వైద్యనిపుణులు, విశాఖ పట్నం

తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి



పరీక్షల సమయంలో విద్యార్థులకు ధైర్యం కల్పించేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి. పిల్లలతో ఎక్కువ సేపు గడపాలి. దూరప్రాంతాల వారు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం సద్వినియోగం చేసుకోవచ్చు. పాఠశాలల్లో ఫీజు ఒత్తిళ్లు ఏమైనా ఉన్నట్లెతై కమిషన్‌ను సంప్రదించాలి.

– డాక్టర్ గొండు సీతారాం, ఏపీఎస్సీపీసీఆర్ సభ్యుడు

విజయం సాధిస్తాం



పరీక్షలను ఎలా ఎదుర్కోవాలో మా స్కూల్లో ఉపాధ్యాయులు సలహాలు ఇచ్చారు. స్పెషల్ క్లాసుల వల్ల సబ్జెక్టులన్నీ ఒకటికి రెండు సార్లు రివిజన్ చేసుకున్నాం. పబ్లిక్ పరీక్షలనే భయమేమీ లేదు. బాగా రాసి, మంచి మార్కులతో విజయం సాధిస్తాను.

– పల్లి యామిని, విద్యార్థిని, అడవివరం హైస్కూల్

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్: BA, B.Com, B.Sc., MA, M.Com., M.Sc., MBA & MCA అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 73862 63237, 90590 86040 [V-2446]

Real Estate

PLOT FOR SALE

■ భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రక్కన VMRDA అప్రూవ్ లే అవుట్‌లో ప్రముఖ సంస్థకు చెందిన ప్లాట్లు తక్కువ ధరలలో కలవు. భవిష్యత్తులో మంచి ఆధాయం కలదు. ఫోన్ : 90140 52585 [V- 11897]

■ విశాఖ 'టు' చెన్నైయ్ బీచ్ కారిడార్‌కి 3 కి॥మీ॥లో 150 గజాలు 12 లక్షలకే. 120 బిట్లు కలవు. వెంటనే ఇల్లు కట్టుకోవచ్చు EMI కలదు. ఫోన్ : 81217 60605 [V- 796989]

■ Gajuwak to Yelamanchili 100 Feet Road Facing Layout Approved Plots for sale 220 Sqy. per Sqy 6000/-. Cont : 73865 88111 [V- 1510]

Services

ASTROLOGY

■ శ్రీసాయి దుర్గ జ్యోతిష్యాలయం 8 సం॥లు స్థిరంగా ఉన్నారు. ప్రేమ, పెళ్ళి, వశీకరణ, అనారోగ్య, వ్యాపార, సంతానం మీ ఎటువంటి సమస్యలకైనా కొద్దిరోజుల్లో పరిష్కారం. SR మాల్ ప్రక్కన కొత్త గాజువాక. 7702201190. [W-1264901]

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 11800]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మ్యానువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233889]

■ గాజువాకలో ప్రముఖ విద్యాసంస్థలో పనిచేయుటకు టెలికాలర్స్ (Female) కావలెను. విద్యార్హత: ఇంటర్/డిగ్రీ. జీతం: 7000/-. సంప్ర॥ 98485 77745, 96666 94545. [V-796988]

■ ప్రముఖ సంస్థలో పనిచేయుటకు టెలికాలర్స్ (F) & కంప్యూటర్ ఆపరేటర్ (F) కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర॥ లావణ్య: 88856 47425 [V-1948]

■ Free Software Traning : B.Tech - Degree 21, 22, 23 Pass Outs, 4 Months Duration @ Dwarakanagar. Ph : 99633 66009, 95739 79344 [V-5588]

■ ప్రముఖ కేబుల్ సంస్థ వైజాగ్, విజయవాడ, నెల్లూరు నందు ఫీల్డ్ వర్క్ చేయుటకు వర్కర్స్ కావలెను.(మేల్) అర్హత: 9th, 10th, ITI, ఇంటర్, శాలరీ:10-15వేలు.8341024265,7013980202 [G-824374]

■ Wanted Public Relation Officer for students mobiligation into an admissions, BMS Visakhapatnam. 7995013422 [S-5722]

■ సువర్ణభూమి కంపెనిలో పనిచేయుటకు 10th - P.G. చదివిన యువతి, యువకులు కావలెను. 7500 /- to 25,000/- జీతం + ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. చినబాబు (AVP) ఫోన్. 83419 19629. [V-823757]

■ సూపర్ వైజర్లు, HR, సెక్యూరిటీగార్డులు పార్సిల్ ఆఫీస్ డెలివరీ బాయ్స్, పెట్రోల్ బంక్ బాయ్స్, హౌస్ కీపింగ్ కావలెను. వాట్సప్ నెం : 77029 59468, సెల్ : 87904 11889 [V- 1399]

CHANGE OF NAME

I, CHANDAKA RAMANAMMA M/o No 15332804N Hav Chandeka Papi Naidu R/o D. No 71-31-584, Kranthinagar, Gandhi gram (po), Visakhapatnam (Dist) Andhra Pradesh (State) Pin-530005. Have changed my name from RAMANAMMA to CHANDAKA RAMANAMMA & DOB from 01-07-1964 to 09-09-1960 Vide Affidavit dated 16-03-2024, Visakhapatnam.

■ ప్రముఖ కంపెనిలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15-25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233892]


■ Full / Part time Work డ్వాక్రా గ్రూపు మహిళలు / వికలాంగులకు, నిరుద్యోగులకు స్వయం ఉపాధి శ్రీ అబ్దుల్ కలాం గారితో అవార్డు పొందిన ఇండియన్ కంపెనీ ప్రొడక్ట్స్ పెట్టుబడి లేకుండా "సూపర్ మార్కెట్" ఫోన్: 90001 08200 [V- 11882]

■ ఒమేగా హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ: 20k ఫోన్: 8977639682 / 8977639683 [H-799855]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గోరంత! స్పందన కొండంత!! సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.



- అద్దెకు
- అమ్మకం
- రియల్ ఎస్టేట్
- ఫర్నీచర్స్
- ఆటోమొబైల్స్
- కంప్యూటర్స్
- సర్వీసెస్
- కావలెను



మురళీనగర్, మాధవధార	: 90101 33346
NAD, కంచరపాలెం	: 90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	: 70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	: 90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	: 97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం